తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
05 ఆగస్టు 2026

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

- సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు
- సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు

**మహబూబ్ నగర్ రూరల్ ఆగస్టు 04(జనం సాక్షి):**
కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా, మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, ఓ టీ పి లు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు.
సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, అధికారిక వెబ్‌సైట్లు మరియు అధికారిక మొబైల్ యాప్‌లను మాత్రమే వినియోగించాలి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా ఒఒఒ.ఎఎవతీఒతీఅఎ.స్రీజ.అఅ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.
బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, రెండు దశల భద్రత ను తప్పనిసరిగా వినియోగించడం ద్వారా వ్యక్తిగత డిజిటల్ ఖాతాలను మరింత భద్రపరచుకోవాలని సూచించారు.
సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రతిఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, సైబర్ జాగృక్తా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం ద్వారా సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ కోరారు.



జిల్లా ఎస్పీ డి.జానకి

## కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కృష్ణ, అగస్టు 4 (జనంసాక్షి):**
కృష్ణ నది పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణ తాహసిల్దర్ శ్రీనివాస్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణపూర్ డ్యాం గేట్లు ఎత్తినందున పై నుండి నీటి ప్రవాహం ఉధృతంగా నారాయణపేట జిల్లా, కృష్ణా మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణ తాహసిల్దర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది పరివాహక ప్రాంత ప్రజలు కృష్ణ మండలం, గురుజాల్, హిందూపూర్, వాసు నగర్, ముడుమల్ మొదలగు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి కృష్ణానది లోకి చేపలు పట్టడానికి, ఇతర పొలం పనులకు, పశువులను మేపడానికి వెళ్లరాదని, పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి, సెల్ఫీ ఫోటోలు దిగడానికి వెళ్లరాదని పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

### - విద్యార్థుల ప్రాణాలకు ముప్పు.. తక్షణ చర్యలు తీసుకోవాలి






**ఉర్కొండ, ఆగస్టు 04, (జనంసాక్షి);** నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలం, జకినాలపల్లిలి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు నుండి ప్లాస్టర్ ఊడిపడుతోంది. గోడల్లో పగుళ్లు ఏర్పడి, వర్షం పడితే నీరు లోపలికి కారుతోంది. ప్రస్తుతం సుమారు 50 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు.వర్షాకాలంలో భవనం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. కొత్త భవనం మంజూరు చేయాలని, అప్పటివరకు ప్రత్యామ్నాయ భవనంలో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు జిల్లా విద్యా శాఖాధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉండడానికి సరైన గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. వంటశాల గది నిర్మించిన కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేయలేక మధ్యలో వదిలేసి వెళ్లిపోవడం జరిగింది. మొత్తం ఉపయోగానికి రాలేని పరిస్థితిలో శిథిలావస్థలో వంటశాల గది ఉంది. విద్యాశాఖ ద్వారా ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దురదృష్టం. ఇప్పటికైనా విద్యార్థుల భద్రత దృష్ట్యా తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## దామరగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 4(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా దామ రగిద్ద తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ఇద్దరూ లేకపోవడంతో వారు ఎక్కడికి వెళ్లారని సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. వారు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్లు సీనియ ర్ అసిస్టెంట్ వివరించారు.అనంతరం రిజిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్,రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా యి, మంగళవారం ఎన్ని రిజిస్ట్రేషన్లు నమోదయ్యా యనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్యాలయ ఆవరణలో ఓ మూలన ఫైళ్లను మూటకట్టి ఉంచడం పై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను ప్రత్యేక గది లో భద్రంగా భద్రపరచకుం డా ఇలా నిర్లక్ష్యంగా ఎందుకు ఉంచారని సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు.
తదనంతరం పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశా రు. మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులు ఏమి టి, ఫామ్ పాండ్ల నిర్మాణా లు ఎంతవరకు పూర్తయ్యా యనే వివరాలను ఎంపీడీ వో సాయిలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు.అ తర్వా త దామరగిద్ద తండాలో శిథిలావస్థకు చేరిన ప్రభు త్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని, ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను సందర్శించా రు. పాఠశాలలో విద్యార్థు లు, ఉపాధ్యాయుల సంఖ్య పై ఆరా తీశారు.ఈ సంద ర్భంగా తండాకు నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విద్యా ర్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున తండా విద్యార్థు లను దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపే అవకాశాన్ని పరిశీలించాల ని సూచించారు.అయితే మండల కేంద్రంలోని పాఠశాలకు వెళ్లేందుకు తండా విద్యార్థులు ఆసక్తి చూప రని, తద్వారా గైర్హాజరు అయ్యే అవకాశముందని సర్పంచ్ వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, తండాకు రెండు ప్రైవేట్ పాఠశాల బస్సులు వస్తు న్నాయని, వాటిలో విద్యా ర్థులు వెళ్తున్నప్పుడు ప్రభు త్వ పాఠశాలకు ఎందుకు వెళ్లలేరని ప్రశ్నించారు.ఎలాగైనా తండాకు నూతన ప్రభుత్వ పాఠశాల భవనా న్ని మంజూరు చేయాలని సర్పంచ్ శరణ్ నాయక్ మరోసారి కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు డెమో.. 7న మహబూబ్‌నగర్‌లో ఎంపికలు

**అచ్చంపేట, ఆగస్టు 4 (జనంసాక్షి):** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ (TGTWREIS) ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పార్ట్‌టైమ్ లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల (JLs, PGTs, TGTs, PDs) పోస్టుల భర్తీకి డెమో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీఓ) కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.
ఈ డెమో ఆగస్టు 7న ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ తిరుమల హిల్స్, అప్పన్నపల్లిలోని TGTWR Degree College for Women ప్రాంగణంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని అధికారులు సూచించారు.

**ఖాళీలు ఉన్న సబ్జెక్టులు:**
జూనియర్ లెక్చరర్లు – తెలుగు, బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్, కామర్స్, మైక్రో బయాలజీ.
పీజీటీలు – తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్.
టీజీటీలు – తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు.
మరిన్ని వివరాలకు సంప్రదించవచ్చు:
కొండాపూర్: 9440898336, జడ్చర్ల: 8333925369, అచ్చంపేట: 8333925372, మన్ననూర్: 9490957314, కల్వకుర్తి: 9490959716 ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గురుకుల సంస్థ అధికారులు కోరారు.

# తల్లిపాలే శిశువుకు జీవనాధారం

**• కోహీర్ మండలంలో జాతీయ తల్లిపాల వారోత్సవాలు • అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం**



**కోహీర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** కోహీర్ మండలంలోని బీదర్ బేస్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి, తల్లిపాల ప్రాధాన్యతపై వైద్య నిపుణులు, అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. శిశువు జననం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, తొలి ఆరు నెలల పాటు నీరు, తేనె లేదా ఇతర ఆహారం ఇవ్వకుండా పూర్తిగా తల్లిపాలే అందించాలని సూచించారు. అనంతరం తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ప్రారంభించి, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి వివిధ అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. అలాగే బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శిశువుకు సరైన సంరక్షణ అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, తల్లిపాలపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు. ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే తల్లిపాల ప్రాధాన్యతపై సమాజంలో మరింత చైతన్యం అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తులసి, అంగన్‌వాడీ సిబ్బంది శాంతి, వనజ, శైలజ, గిరిజ, లలిత, రాము, లింగమ్మతో పాటు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## అర్హులకు మొండిచేయి.. డబుల్ బెడ్‌రూమ్‌లపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు



**పుల్కల్,ఆగస్టు 4 (జనంసాక్షి):** పుల్కల్ మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అర్హులైన లబ్ధిదారులను పక్కనపెట్టే ప్రయత్నం జరుగుతోందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. మంగళవారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, 2022లో రెవెన్యూ అధికారులు 48 మంది అర్హులను ఎంపిక చేసి లక్కీ డ్రా ద్వారా ఇళ్లను కేటాయించారని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో పంపిణీ నిలిచిపోయిందన్నారు.ప్రస్తుతం ఇళ్లకు మరమ్మతులు చేసి పంపిణీకి సిద్ధం చేసినప్పటికీ, గతంలో ఎంపికైన లబ్ధిదారులను పక్కనపెట్టి రాజకీయ ప్రాతిపదికన కొత్త జాబితా రూపొందించి ఇళ్లను కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నిజమైన నిరుపేదలకు అన్యాయం చేయకుండా, గతంలో ఎంపికైన అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల విజయకుమార్, పుల్కల్ గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**అల్లాదుర్గం, ఆగస్టు 4 (జనంసాక్షి):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి శేఖర రెడ్డి అన్నారు. మంగళవారం అల్లాదుర్గం తాసిల్దార్ కార్యాలయం వద్ద కళ్యాణ్ లక్ష్మి షాద్ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డలు వివాహాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ,అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, డిసిసి ప్రధాన కార్యదర్శి బాల కిషన్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాయిబాబా, ఆయా గ్రామాల సర్పంచులు సౌమ్య సురేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,గోపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి,వీరన్న, శంకర్ నాయక్, మాన్య నాయక్, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, శ్రీశైలం, సదానందం తదితరులున్నారు.

## కూరగాయల పంటలపై రైతులు దృష్టి సారించాలి: ఏవో సారిక రెడ్డి

**• వంకాయ పంటలో లింగాకర్షక బుట్టల ఏర్పాటు**




**రాయికోడ్,ఆగస్టు 4, (జనంసాక్షి):** రైతులు కూరగాయల పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక రెడ్డి సూచించారు.మండల పరిధిలోని జంబిగి కే గ్రామానికి చెందిన రైతులు శ్రీ ఒగ్గు విఠల్, ఒగ్గు శ్రీనివాస్‌ల యొక్క క్షేత్రంలోని వంకాయ-టమాట అంతర పంటలను వ్యవసాయ, ఆత్మ సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులం దరూ పత్తి,పప్పు దినుసుల పంటలతో పాటు కూరగాయల పంటలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. కూరగాయ పంటలలో లింగాకర్షణ బుట్టల ఏర్పాటు ద్వారా రైతులు లాభం పొందుతారని, పురుగుల ఉధృతిని తెలుసుకోవచ్చు అన్నారు. భారీ వర్షాల అదృష్ట రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని, పొలంలో నీరు నిలువ కూడా చూసుకోవాలని సూచించారు.క్షేత్రంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో సమీకృత చీడపీడల యాజమాన్యం లో భాగంగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు ఫెరోమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేసే విధానం, వాటి నిర్వహణ, వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై విపులంగా అవగాహన కల్పించారు. ఫెరోమోన్ ట్రాప్‌లో ఆడ పురుగులు విడుదల చేసే వాసనను పోలిన ప్రత్యేక ఆకర్షణ (ఫెరోమోన్ ల్యూర్) ఉండడం వల్ల మగ పురుగులు ట్రాప్‌లో చిక్కుకుంటాయన్నారు. దీంతో పురుగుల సంయోగం తగ్గి, తదుపరి తరం పురుగుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. ఫలితంగా పంటలో చీడపీడల ఉధృతి నియంత్రణలోకి వస్తుందన్నారు. పంటలో హానికర పురుగుల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు అన్నారు. పురుగుల జనాభాను తగ్గించి పంట నష్టాన్ని నివారించవచ్చునని తెలిపారు. రసాయన పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు అన్నారు. ప్రయోజనకర కీటకాలు, తేనెటీగలు మరియు ఇతర సహజ శత్రువులకు ఎటువంటి హాని కలగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్,నిఖిలేష్, ఏటీఎం రమేష్, రైతులు ఎన్ అంజన్న, ఎన్ శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బోయిని రాజుకు పితృ వియోగం

**• పరామర్శించిన రాజకీయ ప్రముఖులు**







**చేర్యాల, ఆగస్టు 04(జనంసాక్షి):** చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు, మాజీ మత్స్య శాఖ చైర్మన్ బోయిని రాజు తండ్రి బోయిని రామస్వామి(80) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం గ్రామానికి చేరుకొని పార్థివదేహంపై పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం బోయిని రాజును వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రామస్వామి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్ లు పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మాజీ దేవస్థాన చైర్మన్ ఆడెపు చంద్రయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంజె మల్లేశం, ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్మురవి, చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ బాలనర్సయ్య, ఆయా పార్టీల నాయకులు దాసరి శ్రీకాంత్, అందే అశోక్, ఆముదాల మల్లారెడ్డి, కాటం సంజీవయ్య, అంకుగారి శ్రీధర్ రెడ్డి, పుర్మ వెంకట్ రెడ్డి, అందె నాని బాబు, శివగారి అంజయ్య, కామిడి రమేష్ రెడ్డి, కర్రెడ్ల మాధవ రెడ్డి, వెలుగల రఘువీర్, శేవల్ల రాజయ్య,ముస్త్యాల కిష్టయ్య, తాటికొండ వేణు గోపాల్, తాటికొండ సదానందం, చింతల పర్శరాములు, ఆకుల రాజు గౌడ్, చింతల మల్లేశం, గొల్లపల్లి కిష్టయ్య, మల్లిగారి నర్సింహులు, పాల బాలరాజు, పల్లె కనకయ్య, పోరండ్ల వెంకటేష్, యాట యాదగిరి, కడారి భాస్కర్, బోయిని బాలయ్య, బుట్టి బిక్షపతి, తాటికొండ రాములు, సూర సంపత్, ఉడుత బాలరాజు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, జర్నలిస్టులు, గ్రామ, మండల ప్రజలు, తదితరులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను పక్క గ్రామానికి తరలించవద్దని స్వచ్ఛందంగా వెల్దుర్తి బంద్






**వెల్దుర్తి, ఆగస్టు 4 (జనంసాక్షి):** వెల్దుర్తికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను పక్క గ్రామానికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ వాణిజ్య వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బందుకు పిలుపునిచ్చాయి. యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం వెల్దుర్తి బందును చేశారు. దీంతో స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ నిర్వహించారు. వెల్దుర్తికి మంజూరైన పాఠశాలను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండు చేశారు.లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేశాం అని గ్రామానికి చెందిన అని పార్టీల నాయకులు డిమాండ్ చేశారు పక్కా మరులు జిల్లా కలెక్టర్కూ వినీతి పాత్రలు అందించడం జరిగింది అన్నారు త్వరలనే తెలంగాణ పబ్లిక్ స్కూలను ఎల్దుతలోనే నిర్మించిమండలంలోని విద్యార్థులు అందరికీ తగు నయం చేయాలి అనీ గ్రామస్తులు సూచించారు. ఈ కార్యక్రమంలో అని పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్ద శంకరంపేట, ఆగస్టు 4(జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేట లోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. మీదింటి ఆడపిల్లల పెళ్లిలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉదయిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణ. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్. మధు మురళి పంతులు. మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్. ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## పాపయ్యపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



బెజ్జంకి, ఆగస్టు4 (జనంసాక్షి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బెజ్జంకి మండలంలోని పాపయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్(పెద్దన్న) మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు జన్మించిన వెంటనే ముర్రుపాలు అందించాలని సూచించారు. ముర్రు పాలలో శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూమల మహేష్, లింగాల వెంకటేష్, తిప్పారపు మహేష్, పొట్లపల్లి శివ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భావని, టీచర్ జమున, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వచ్చింది... ఇల్లు కూలుతుందనే భయంతో కుటుంబాలు



కొల్చారం, ఆగస్టు 04 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనపూర్ గ్రామ ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో పూరి గుడిసెలు కూలిపోయే ప్రమాదం నెలకొంది. ముఖ్యంగా మూడో వార్డు లోని గుడిసెల్లోకి వర్షపు నీరు చేరడంతో ఎప్పుడు కూలిపోతాయో ననే భయాందోళనలో వారు జీవిస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. నిరంతర వర్షాల నేపథ్యంలో ప్రాణ భయంతో రోజులు గడుపుతున్నామని, అధికారులు స్పందించకపోతే ఎలాంటి ప్రమాదం జరిగినా బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. అకాల వర్షాలపై జిల్లా కలెక్టర్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని పదేపదే ఆదేశిస్తున్నప్పటికీ, గ్రామస్థాయిలో మాత్రం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు తక్షణమే స్పందించి కాలనీలోని వర్షపు నీటి సమస్యను పరిష్కరించి, ప్రమాదకర స్థితిలో ఉన్న కుటుంబాలకు రక్షణ చర్యలు చేపట్టాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

## రామాయంపేటలో రహదారి ప్రమాదాలకు శాశ్వత చెక్ పెట్టాలి

• ప్రమాదకర 'వై' జంక్షన్‌ను వెంటనే మూసివేయాలి: బీజేపీ డిమాండ్



రామాయంపేట, ఆగస్టు 4 (జనంసాక్షి): రామాయంపేట పట్టణంలో ఇటీవల మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురైన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని భారతీయ జనతా పార్టీ పేర్కొంది. ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేసింది. రామాయంపేట బైపాస్‌లోని ప్రమాదకరమైన 'వై' జంక్షన్ వద్ద గతంలోనే సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టకపోవడం విచారకరమని బీజేపీ నాయకులు అన్నారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు వెంటనే ఆ జంక్షన్‌ను మూసివేసి, శాశ్వత భద్రతా చర్యలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన విద్యార్థుల రోడ్డు ప్రమాదాన్ని తీవ్రంగా పరిగణించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఎన్‌హెచ్-44 మేనేజర్ రంగారావు, జీఎంఆర్ మేనేజర్ రాజేందర్, స్థానిక సీఐ బాదావత్ సైదానాయక్‌తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శాశ్వత ప్రమాద నివారణ చర్యలపై చర్చించారు. అవసరమైన పనులను పూర్తి చేయడానికి సుమారు 15 రోజుల సమయం అవసరమని అధికారులు వెల్లడించారు. ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా ఎంపీ రఘునందన్ రావు తీసుకున్న చొరవను స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు అభినందించారు. అదేవిధంగా ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం పాఠశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితికి ముగింపు పలకాలని సూచించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నమైన శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు మస్నూరి బాలరాజు, బక్కయ్యగారి యాదగిరి, కౌన్సిలర్ శంకర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి

• డిపిఎం రమేష్ బాబు

• మద్దికుంటలో స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రం ప్రారంభం





సదాశివపేట, ఆగస్టు 4 (జనంసాక్షి): స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్కూల్ యూనిఫామ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని డిపిఎం రమేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం సదాశివపేట మండలంలోని మద్దికుంట గ్రామంలో స్కూల్ యూనిఫామ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపిఎం నాన్ ఫార్మ్ రమేష్ బాబు , జాన్ కెనడీ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉపాధి కోసం మద్దికుంట గ్రామంలో స్కూల్ యూనిఫామ్ స్టిచింగ్ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళా సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం, గ్రామాఖ్య సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, శివకుమార్, సీసీ లు మహిపాల్, లాల్ సింగ్, మాజీ ఎంపీటీసీ మమత, వివో ఏ అరుణ జ్యోతి, గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వీపర్ పదవీ విరమణ సన్మాన సభ



వెల్దండ, ఆగస్టు 04 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని ఎంపీయూపీఎస్ కుప్పగండ్ల పాఠశాలలో పార్ట్‌టైమ్ స్వీపర్‌గా ఎంతోకాలం అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన జమ్ముల యాదమ్మ పదవీ విరమణ సన్మాన సభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మొక్తాల రమేష్ ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ మరియు ఉపాధ్యాయులు, గ్రామస్తులు యాదమ్మ సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి, పరిశుభ్రతకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి,ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగాసన్మానించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. యాదమ్మ చేసిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఆమెకు ఆరోగ్యకరమైన, ఆనందమయమైన పదవీ విరమణ జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్, ఉపాధ్యాయులు దాలినాయుడు, జ్ఞానేశ్వర్, మధుసూదన్ మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరోను విజయవంతం చేద్దాం

• సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సి.ఆర్. గోవింద్ రాజ్ పిలుపు



మక్తల్, ఆగస్టు 04 (జనంసాక్షి): ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా తలపెట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సి.ఆర్. గోవింద్ రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మక్తల్ మండలంలోని కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ముందు ఆశా వర్కర్లతో కలిసి జైల్ భరో కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మెడికల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్ర్యాన్ని ప్రధాని మోదీ విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పోరాటం చేయాలన్నారు. అంత్యోదయ కార్డు ద్వారా నిరుపేదలకు అందిస్తున్న బియ్యం కోటాను తగ్గించడం దారుణమన్నారు. నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, కార్మికులను యజమాని ముందు బానిసలుగా నిలబెట్టే ఈ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశభక్తి ముసుగులో దేశాన్ని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తూ, స్వదేశీ ముసుగులో అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ లాంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగే జైల్ భరో కార్యక్రమంలో ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కర్ని పీహెచ్సీ అధ్యక్షురాలు గోవిందమ్మ, కార్యదర్శి అమీనా బేగం, ఉపాధ్యక్షురాలు యశోద, సుజాత, ఇందిర, లక్ష్మి, పార్వతమ్మ, అనురాధ, అనిత తదితరులు పాల్గొన్నారు.

# స్థానికేతరులకు ఇచ్చిన అసైన్డ్ భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలి

- వతన్ ఆగ్రోస్ మాంసం వ్యర్థాల పరిశ్రమను తరలించాలి
- రసాయన పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయాల్సిందే
- “జలసిరి” గ్రామసభలో.. పార్టీల కతీతంగా ఏకవాక్య తీర్మానం

**న్యాల్‌కల్, ఆగస్టు 04(జనంసాక్షి) :** గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా.. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు, అధికార, విపక్ష పార్టీల శ్రేణులు ఏకీభవించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం మండలంలోని డప్పూర్ గ్రామపంచాయతీ భవనంలో.. గ్రామ సర్పంచ్ జగదాంబ అధ్యక్ష తన “జనసరి గ్రామసభ”ను పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజానికం అధిక సంఖ్యలో సభకు హాజరై పలు సమస్యలను పరిష్కరించాలని గళమెత్తారు.

**సమస్యల పరిష్కారం కోసం సభలో ఏకవాక్య తీర్మానం....**

గతంలోని ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం స్థానికేతరులకు (బీదర్, ఇతర గ్రామాల)కు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను వెంటనే రద్దుచేసి అర్హులైన స్థానికులకు అందించాలి. గ్రామ శివారులో రైతులు, స్థానిక ప్రజానీకానికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న వతన్ ఆగ్రోస్ మాంసం వ్యర్థాల పరిశ్రమను వెంటనే ఇతర ప్రాంతాలకు తరలించాలని, గ్రామ శివారులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న రసాయన పరిశ్రమల భూసేకరణను వెంటనే ఆపివేయాలని, గ్రామ ప్రధాన కూడలి వద్ద గల స్థలాన్ని శ్రీ బసవేశ్వర్ మందిరానికి కేటాయించాలని, తదితర సమస్యలను గ్రామ సభలో సుదీర్ఘంగా చర్చించి ఏకవాక్యంతో తీర్మానించారు. అనంతరం “జలసిరి” కార్యక్రమంలో భాగంగా.. ఎల్ నినో ప్రభావం వల్ల రైతులకు కలిగే నష్టాలు, చేపట్టనున్న



సస్యరక్షణ చర్యలు, వర్షపు నీటిని కాపాడు కోవడం, తదితర అంశాలపై సభలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ, పంచాయతీ కార్యదర్శి జైసింగ్ రాథోడ్, మండల బారాస అధ్యక్షుడు రవీందర్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు నాగమ్మ, రవి, శివరాజ్, రాజు, నర్సింలు, ఎల్లారెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అవగాహన



**నిజాంపేట, ఆగస్టు 4 (జనంసాక్షి):** ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదా నాయక్ అన్నారు. నిజాంపేట పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్‌లు, స్కూల్ బస్సు డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను కూర్చోబెట్టోదన్నారు.

# అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఏ.శ్రీనివాసులు

**అడ్డాకుల, 4(జనంసాక్షి):** జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు అడ్డాకుల, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లను ఆకస్మిక తనిఖీ చేశారు.అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో నిర్వహిస్తున్న “ఆశ డే”సమావేశములో మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమములను సమీక్షించడం జరిగింది.ప్రతి ఆశ, ఆరోగ్య సిబ్బంది వ్యాధుల నివారణ కార్యక్రమములను సంబంధిత శాఖల సిబ్బందితో సమన్వయముతో పనిచేసి ప్రజల ఆరోగ్యమును కాపాడాలని కోరారు. అదే విధంగా తల్లి పాల వారోత్సవములనుద్దేశించి మాట్లాడుతూ






తల్లిపాలు శిశువుకు అమృతంలాంటివి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం,జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని తెలిపారు. తల్లిపాలలో యాంటీబాడీస్ ఉంటాయి, ఇవి బిడ్డను ఇన్ఫెక్షన్లు మరియు వ్యాధుల నుండి కాపాడుతాయి.సులభంగా జీర్ణమవుతాయి: ఇవి చిన్నారి సున్నితమైన కడుపుకు తేలికగా జీర్ణమై,ప్రేగుల లోని బ్యాక్టీరియాను మెరుగుపరుస్తాయని అన్నారు.తల్లిపాలు తాగే పిల్లల్లో తెలివితేటలు మరియు మెదడు ఆరోగ్యంగా ఉంటుందని, భవిష్యత్తులో స్థూలకాయం మరియు అస్తమా వచ్చే ప్రమాదం చాలావరకు తగ్గుతుందని అన్నారు.

తల్లికి కలిగే ప్రయోజనాలు: పాలివ్వడం ద్వారా శరీరంలోని అదనపు కేలరీలు ఖర్చై ప్రెగ్నెన్సీ బరువు తగ్గుతారు. ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలై ప్రసవ అనంతర రక్తస్రావం తగ్గుతుందని తెలిపారు.రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మరియు మధుమేహం (షుగర్) వచ్చే రిస్క్ తగ్గుతుందని తెలిపారు. తర్వాత జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును తనిఖీ చేశారు.

# శీతలదేవి అమ్మవారికి బోనం సమర్పించిన మేయర్ వై.మమత

**మహబూబ్‌నగర్ ప్రతినిధి ఆగస్టు 04(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ సాంస్కృతికం ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. నగరంలోని రవీంద్రనగర్‌లో వెలిసిన శ్రీ శీతలదేవి అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్ వై. మమతా ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంప్రదాయబద్ధంగా తలపై బోనం ఎత్తుకుని ఆలయానికి చేరుకున్న మేయర్, అమ్మవారికి బోనాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.నగర ప్రజల క్షేమం కోసమే ప్రత్యేక పూజలు:ఈ సందర్భంగా ఆలయంలో మేయర్ మమత అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆషాఢ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని కొనియాడారు. నగర ప్రజలందరూ ఎలాంటి ఆపదలు లేకుండా, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలంతా క్షేమంగా ఉండాలనే సంకల్పంతో ఈ బోనాల కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమె పేర్కొన్నారు.భక్తజన సందోహం –



ఘనంగా ఉత్సవాలు:ఈ బోనాల మహోత్సవంలో స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు రంగురంగుల చీరలు ధరించి, మంగళహారతులు, ఘటాలతో ఆలయానికి తరలిరావడంతో రవీంద్రనగర్ పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాల కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో వేచి ఉండి దర్శనాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నగర ప్రముఖులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల చదువే సమాజానికి వెలుగు

- సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం




**కల్వకుర్తి, ఆగస్టు04(జనంసాక్షి):** “ఆడపిల్లలను చదివిద్దాం..ఆడపిల్లలను రక్షిద్దాం” అనే నినాదంతో కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అంగన్‌వాడీ టీచర్ అలివేలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు.ప్రతి బాలికకు విద్య,భద్రత, పోషకాహారం,ఆరోగ్య సేవలు అందేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడం, లింగ వివక్షను రూపుమాపడం, బాలికల హక్కులను కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బాలికల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, బాలికలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు, గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ లబ్ధిదారులు పాల్గొని బాలికల విద్యాభివృద్ధి, రక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పోలా అలివేల, వెంకటమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు గర్భిణీ స్త్రీలు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో అన్నప్రాశన కార్యక్రమం

- మురుగుపాలు - బిడ్డకు మొదటి టీకా: ఎంపీడీఓ సునీత



**శ్రీరంగాపూర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** మండల కేంద్రమైన శ్రీరంగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం. 3లో శాన్విక అన్నప్రాశన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ సునీత మేడం, ఏపీవో రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాన్విక తల్లిదండ్రులు స్వప్న, రాఘవేందర్, గర్భిణులు, బాలింతలు మనుష, కవిత, గీత, అనురాధ, అస్మా, రహీమ్, ఉష, విజయలక్ష్మి, కళావతి, ప్రీ స్కూల్ పిల్లలు, అంగన్‌వాడీ టీచర్ మంజులారాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాతో సమానం. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలొద్దు. పాలిచ్చే తల్లులు పరిశుభ్రత పాటించాలి. 6 నెలల తర్వాత అనుబంధ ఆహారం తప్పనిసరీ అని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతిరోజు వచ్చి పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు కూడా అనుబంధ ఆహారం తీసుకోవాలని సూచించారు. ఏపీవో రాజు మాట్లాడుతూ 3 సంవత్సరాల వయసు నుండే పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి. ఇక్కడ ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో పాటు పోషకాహారం అందిస్తాం. దీనివల్ల పిల్లల ఎదుగుదల బాగుంటుంది అని అన్నారు. అనంతరం శాన్వికకు అన్నప్రాశన చేసి, హాజరైన గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్యాకెట్లు అందజేశారు.

# కొత్త ఎరువుల బుకింగ్ యాప్ 6 నుంచి అందుబాటులోకి

- మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



**కొల్చారం, ఆగస్టు 4 (జనంసాక్షి):** రైతులకు అందుబాటులో ఉన్న ప్రస్తుతం వినియోగిస్తున్న ఫర్టిలైజర్ యాప్ (యూరియా యాప్) స్థానంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన **“ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్”** యాప్ ఈ నెల ఆగస్టు 6, 2026 నుంచి అందుబాటులోకి రానుందని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు.

ఈ కొత్త యాప్ ద్వారా రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పోటాష్ తదితర ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ఇప్పటికే యూరియా సంచులను బుక్ చేసుకున్న రైతులందరూ ఈ రోజే సంబంధిత ఎరువుల దుకాణాలకు వెళ్లి తమ బుక్ చేసిన యూరియా సంచులను తీసుకోవాలని ఆమె సూచించారు. కొత్త యాప్ అమల్లోకి వచ్చే ముందు పెండింగ్ బుకింగ్‌లను పూర్తి చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# బాలల గ్రామ సభ, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు విజయవంతం



బెజ్జంకి,ఆగస్టు 4,(జనంసాక్షి): మండలంలోని తోటపల్లి గ్రామంలో సర్పంచ్ కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలల గ్రామ సభ,క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు,విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.బాలల గ్రామ సభలో విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ గ్రామాభివృద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, స్వచ్ఛత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపేందుకు గ్రామ ప్రజలు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాంపల్లి శంకర్,వార్డు సభ్యులు బుర్ర మహేందర్, ఎన్న వజ్రమ్మ నర్సయ్య,అధికారులు,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అడ్డాకుల గ్రామ శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక



అడ్డాకుల ఆగస్టు 4 (జనంసాక్షి): అడ్డాకుల గ్రామ శ్రీ కృష్ణ యాదవ సంఘం తరపున ఏకగ్రీవంగా నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలోఅధ్యక్షులుగా టశీకరి శివ, ఉపాధ్యక్షులుగా మోటపోతుల రాములును కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది, వారి ఇరువురిని గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగుల విజయ మోహన్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మోటపోతుల భీమన్న యాదవ్, రాములు, టశీకరి ఎల్లన్న, కాటవరం సర్పంచ్ జగదీష్ మరియు గ్రామ యాదవ సంఘం సభ్యులు పాల్గొనడం జరిగింది.

# గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు

- గర్భిణిలు పూర్తి ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి: డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శన్




గుండుమాల్ ఆగస్ట్ 4(జనంసాక్షి): గుండుమాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో జిల్లా మాతా-శిశు ఆరోగ్య అధికారి డాక్టర్ సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా నాలుగు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే గర్భిణీలకు అవసరమైన మందులు, ఐరన్ మరియు కాల్షియం మాత్రలను పంపిణీ చేశారు. అలాగే బాలింతలకు కనీసం రెండు ఆరోగ్య పరీక్షలు చేయించడంతో పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మరియు కాల్షియం కార్బోనేట్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని తెలిపారు. తల్లి మరియు శిశువు ఆరోగ్యం కోసం ప్రతి గర్భిణీ స్త్రీ నిర్దేశిత సమయాలకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
మలేరియా నియంత్రణలో భాగంగా యాంటీ లార్వా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజన్న మార్గదర్శకాలు ఇచ్చారు. జ్వర బాధితులను గుర్తించి క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, సంబంధిత నివేదికలను అదే రోజు మధ్యాహ్నం ఒక గంటలోపు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎచ్ఎన్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అరవింద్ కుమార్, వైద్యకారి కిష్టమ్మ, సూపర్వైజర్లు మణిమాల, రవి కుమార్, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గౌడ సంఘం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 04 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆషాఢ బోనాల ఊరేగింపు కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా బోనాలు సమర్పించిన మహిళలకు, భక్తులకు ఎమ్మెల్యే శు భాకాంక్షలు తెలిపారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల వేషధారణలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు.
అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,నరేందర్ గౌడ్, చింత సాయినాథ్, భరత్ గౌడ్, కిరణ్ గౌడ్, సంకీర్త్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ , దుర్గ గౌడ్ , సంగమేశ్వర్ గౌడ్, కౌన్సిలర్ నాని, జీవీ శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, విఠల్, గోవర్ధన్ రెడ్డి, ప్రభు గౌడ్, గౌడ సంఘం నాయకులు, మహిళలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎరువుల బుకింగ్ కోసం ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను వినియోగించాలి

- మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్



ఉప్పునుంతల, (జనంసాక్షి): రైతులు ఎరువుల కొనుగోలు కోసం తెలంగాణ వ్యవసాయ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ (Fertilizers For Sale) మొబైల్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా రైతులు యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ తదితర ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను సులభంగా, పారదర్శకంగా పొందేందుకు ఈ విధానం దోహదపడుతుందని చెప్పారు.
రైతులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి FFS (Fertilizers For Sale) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్రాన్ని ఎంపిక చేసి, రైతు ఐడీ లేదా ఆధార్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలన్నారు. అవసరమైతే ఈ-కేవైసీ పూర్తి చేసి, భూమి వివరాలు నమోదు చేసి పంట వివరాలు (Crop Intent) నమోదు చేయాలని తెలిపారు.
తర్వాత అవసరమైన ఎరువుల రకాన్ని, పరిమాణాన్ని ఎంపిక చేసి, తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంచుకుని బుకింగ్‌ను సమర్పించాలన్నారు. బుకింగ్ పూర్తయ్యాక టోకెన్ నంబర్ లభిస్తుందని, ఆ టోకెన్ ఆధారంగా సంబంధిత కేంద్రంలో ఎరువులను పొందవచ్చని వివరించారు.
ఆగస్టు 13వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాల్లో, అలాగే ఆగస్టు 20వ తేదీ నుంచి మిగతా జిల్లాల్లో ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందస్తుగా ఎరువులను బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్ విజ్ఞప్తి చేశారు.
ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800-425-3553 ను సంప్రదించాలని సూచించారు.

# గుంతల రోడ్లను తిరిగి నిర్మించాలి

- పన్నులు వసూలు చేయడం తప్ప, ప్రజలకు సౌకర్యాలు కల్పించరా?
- డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన సిపిఎం నాయకులు



అమీన్పూర్, ఆగస్టు 4 (జనంసాక్షి): అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్లో గల భ్రమరాంబికా నగర్ కాలనీలో గుంతలతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన సిసి రోడ్లకు మరమ్మత్తులు చేయాలని సిపిఎం సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. అమీన్పూర్ కమిటీ ఆధ్వర్యంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భ్రమరాంబిక నగర్ కాలనీలో దాదాపు 24 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు తప్ప ఇప్పటికీ మళ్ళీ రోడ్లు వేయలేదన్నారు. వాటర్ పైప్ లైన్,డ్రైనేజ్ సమస్యల వల్ల రోడ్లను తవ్వడంతో పూర్తిగా రోడ్లు గుంతలుగా మారాయని గుర్తు చేశారు.
చిన్నపాటి వర్షానికి నడవలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంత లలో వర్షం నీరు,డ్రైనేజ్ నీరు, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల వల్ల కాలనీ వాసులు విష జ్వరాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గతంలో అనేక మార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రజల దగ్గర పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, ప్రజలకు మౌలిక అవసరాలు తీర్చడంలో లేదని విమర్శించారు.
ఇప్పటికైనా అధికారులు కాలనీకి వచ్చి రోడ్లను పరిశీలించి సమస్య పరిష్కారం చేయడం కోసం తగిన నిధులను కేటాయించి రోడ్లను నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే కాలనీ వాసుల అందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరస్వామి, జిలాని, అంజిరెడ్డి, కిషోర్ కుమార్, రమణయ్య, రాఘవేంద్ర బట్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జన్మదినాన్ని 'తెలంగాణ అస్తిత్వ దినంగా' జరుపుకోవాలి

- రజక సంఘం జిల్లా నాయకులు విజయ్



ఖిల్లా ఘనపురం, ఆగస్టు 4 (జనంసాక్షి): ఆగస్టు 6న తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని తెలంగాణ అస్తిత్వ దినంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని తెలంగాణ అస్తిత్వ వేదిక వ్యవస్థాపకులు విరమల్ల ప్రకాష్ పిలుపునివ్వడం గర్వించదగ్గ విషయమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలందరూ ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళులు అర్పించాలని రజక సంఘం జిల్లా నాయకులు విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆచార్య జయశంకర్ జయంతిని ప్రతి ఏటా ఆగస్టు 6న తెలంగాణ అస్తిత్వ దినంగా పాటించాలని తెలంగాణ అస్తిత్వ వేదిక విస్తృత స్థాయి సమావేశంలో వ్యవస్థాపకులు తెలంగాణ ప్రకాష్, కన్వీనర్ పిట్టల రవీందర్, కో-ఆర్డినేటర్ శ్రీధర్ రావు దేశ్‌పాండే తదితరులు ఏకగ్రీవంగా తీర్మానించారని తెలిపారు.తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజలు, మేధావులు, ఉద్యమకారులు ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తంగా చాటాలని పిలుపునిచ్చారు.
ప్రతి సంవత్సరం ఆగస్టు 6న తెలంగాణ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలు తమకు వీలైన రీతిలో సభలు, సమావేశాలు, సెమినార్లు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## నూతన ఎంపీడీవో ఉమాదేవికి గురుజువాడ సర్పంచ్ ఘన సన్మానం



**కోహీర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల నూతన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా బాధ్యతలు స్వీకరించిన ఉమాదేవిని గురుజువాడ గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మర్యాదపూర్వ కంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ, నూతన ఎంపీడీవో ఉమాదేవి నాయకత్వంలో మండల అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబు దారీ తనంతో కూడిన సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా రాణించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ అంజయ్యతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో ఆవు మృతి

- రైతుకు రూ.80 వేల నష్టం



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్లికంటి చిన్నయ్యకు చెందిన ఆవు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో ఎల్లికంటి చిన్నయ్యకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని గ్రామస్థులు పేర్కొన్నారు. పాడి పశువుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబానికి ఇది తీవ్ర దెబ్బగా మారిందన్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల మేరకు బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు కోరారు.

## భారీ వర్షానికి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- సర్పంచ్ చొరవతో తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**ఎర్రవల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండలంలో సోమ వారం రాత్రి కురిసిన భారీ వర్షం, బలమైన గాలుల కారణంగా ఫాస్టర్ హనోక్ సార్ చర్చి వెనుక ఉన్న విద్యుత్ లైన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ విషయాన్ని కాలనీవాసులు రాత్రి నుంచే ఎర్ర వల్లి సర్పంచ్ అనిత కృష్ణసాగర్ తెలియజేశారు. ఆమె వెంటనే స్పందించి విద్యుత్ శాఖ ఏఈ రాజు శేఖర్ మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ అనిత కృష్ణసాగర్, AE శేఖర్, విద్యుత్ శాఖ సిబ్బందికి కాలనీ వాసులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వెల్దండలో వీబీజీ రాంజీ ఉద్యోగుల నిరసన



**వెల్దండ, ఆగస్టు 04 (జనంసాక్షి):** గత ఉపాధి హామీ పథకం ప్రస్తుత (విబిజిరాంజీ)లో 20 గత సంవత్స రాలుగా పనిచేస్తున్న ఎఫ్.టి ఈ(ఫిక్సిడ్ టెన్యూర్ ఎంప్లాయ్)లకు ఇస్తామని పేస్కేల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మేని ఫెస్టోలో పెట్టడం జరిగింది. దానికి అనుగుణంగానే రెండు సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 2024 నాడు ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం పొంది ప్రకటనకు ముందు నిలిచిపోయింది. అది ఇప్పటివరకు అమలు కాలేదు కాంగ్రెస్ ప్రభుత్వం విబిజి రాంజీ ఉద్యోగులకు ప్రకటించిన పే స్కేల్ ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను అమలు చేయాలని కోరుతూ వెల్దండ మండలంలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన చేయడం జరిగింది. రేపటినుండి విబిజిరాంజీ పథకంలో పే స్కేల్ అమలయ్యే వరకు ఎలాంటి పనులు జరగకుండా షట్ డౌన్ కార్యక్రమం ఉధృతం చేస్తామని ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వర్ జి, ఈసీ దేవేందర్ గౌడ్ ,ఏ.సి.ఓ లు కే రాము, ఎస్ హుస్సేన్, టెక్నికల్ అసిస్టెంట్లు లింగస్వామి కృష్ణవేణి, శివలీల, సత్యనారాయణ, రేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా: సర్పంచ్ అభిబాబి



**రాయికోడు, ఆగస్టు 4, (జనంసాక్షి):** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారం తో గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని మాటూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి అభిబాబి స్పష్టం చేశారు. మంగళవారం సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి జావిద్ భాష,ఉప సర్పంచ్ నాగరాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. మంత్రి సహకారంతో గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నరసింహులు పటేల్, నాగమ్మ, నరసింహులు,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి మక్సూద్, మాజీ ఎంపిటిసి చంద్రయ్య, నాయకులు అక్బర్ సాబ్, ఉపాధి హామీ ఎఫ్ ఏ తిప్పరాజు, అంగ న్వాడి టీచర్ నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అప్రెంటిస్ మేళాకు ఏర్పాట్లు

- పటాన్‌చెరులో ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో నిర్వహణ

**రామచంద్రాపురం, ఆగస్టు 4(జనంసాక్షి):** పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ), పటాన్‌చెరులో ఈ నెల 11న (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పరిశ్రమలు ఈ మేళాలో పాల్గొని అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు www. apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసు కుని మేళాకు హాజరుకావాలని సూచించారు.

**అభ్యర్థులు వెంట తెచ్చుకోవాల్సిన పత్రాలు:**

1. రెజ్యూమ్ / బయోడేటా,
2. అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ,
3. ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు
4. ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులు
5. కుల ధ్రువీకరణ పత్రం
6. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని ప్రిన్సిపాల్ ఎం.సుజన కోరారు. మేళాకు సంబంధించిన వివరాల కోసం 9121797379, 9440068152 నంబర్లలో సంప్రదించా లని సూచించారు.

# నకిలీ నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు

- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి: ఎస్సై పోచయ్య



**రేగోడ్, ఆగస్టు04(జనంసాక్షి):** మెదక్ జిల్లా ఎస్పీ డి శ్రీనివాసరావు సూచనల మేరకు రేగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయం త్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్‌పి) మాత్రమే చట్టబద్ధమైన వని, నకిలీ, మార్పులు చేసిన,స్టిక్కర్ ఆధారిత, డూప్లికేట్ లేదా అస్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను వాహనాలపై అమర్చడం చట్టవిరుద్ధమని రేగోడు ఎస్ఐ పోచయ్య తెలిపారు. వారు మాట్లా డుతూ, ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించడం ద్వారా వాహనాల అసలు గుర్తింపును దాచడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, నేర కార్యకలాపాలకు సహక రించే అవకాశం ఉన్నందున ఇటువంటి ఉల్లంఘనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ లేదా అనధి కారిక నెంబర్ ప్లేట్లతో సంచరించే వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకుని అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసుతోపాటు జైలు శిక్ష తప్పదని మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన రిజిస్టర్ ఓనర్ పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని వాహన యజమానులు తమ వాహనాలకు ప్రభుత్వం ఆమోదించిన హెచ్ ఎస్ ఆర్ పి నంబర్ ప్లేట్లు మాత్రమే అమర్చుకున్నట్లు వెంటనే ధృవీకరించుకోవాలని సూచిం చారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ నిబంధనలను పాటిస్తూ, ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ, ఆగస్టు 04(జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు మారేపల్లి శ్రీను తండ్రి మారేపల్లి నిరంజన్ మరణించిన విషయం తెలుసుకున్న వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యెన్నం భూపతి రెడ్డి లు మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను అధైర్య పడకుండా, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ ఉమా సంజీవ్ యాదవ్, మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ క్యాసరపు వెంకటయ్య , వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుర్రటి కిష్టల్, గోసుల కొండల్,మసిగుండ్ల వెంకటేష్, సీనియర్ నాయకులు ఎండి అమీద్,కొయ్యల పుల్లయ్య, తుంగ శ్రీను, మట్ట భరత్,జంగిలి ఆనందు ,గోరేటి భరత్, మట్ట విష్ణు,పుట్ట యాదయ్య, అన్నెపు వెంకటయ్య,రేవల్లి బాలరాజు , మట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబా భవాని శోభాయాత్ర



**మక్తల్, ఆగస్టు 04 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలో భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 46వ బోనాల పండుగ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున భవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుండి భవానీ మాత ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. యాత్రలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమాజ్ అధ్యక్షులు బోడికే సత్యనారాయణ రావు మాట్లాడుతూ 46 ఏళ్లుగా ఈ వేడుకను నిర్వహిస్తున్నామని, ఆంధ్ర, తెలంగాణలో లక్షలాది టైలర్, రంగ్రేజ్ కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, ప్రభు త్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు.

కార్యక్రమంలో బీజేపీ నేత కొండయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ జైతినే, జిల్లా అధ్యక్షుడు బాండేకర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## NH-44పై టిప్పర్ లారీ బోల్తా

• డ్రైవర్ క్షేమం, ప్రాణాపాయం తప్పింది

**బాలానగర్, ఆగస్టు 04(జనంసాక్షి):** బాలానగర్ మండలం సమీపంలో గల రంగారెడ్డిగూడ-రాజాపూర్ మధ్య 44వ జాతీయ రహదారి పై కొద్దిసేపటి క్రితం టిప్పర్ లారీప్రమాదవశాత్తు బోల్తా పడింది. బి.ఎస్.సి.పి.ఎల్ కంపెనీ నుండి లోడ్ తీసుకుని అరబిందో సెజ్ కు లోడ్ తరలిస్తుండగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. టిప్పర్ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత

• రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ, ఆగస్టు 04(జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి నిరంజన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5000 రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్తాల శేఖర్, మాజీ ఎంపిటిసి లింగం, మాజీ ఎంపిటిసి నిరంజన్, నాగులు నాయక్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మాజీ మండల అధ్యక్షులు జోగయ్య, పార్టీ సీనియర్ నాయకులు జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య,సీనియర్ నాయకులు మంగళగిరి సత్యం, అంజి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్‌లో ఘనంగా బాల గ్రామసభ నిర్వహణ

• గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో



**కొల్చారం, ఆగస్టు 4 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం బాల గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, సురక్షిత తాగునీటి అందుబాటు, బాల్యవివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామ సభలో విద్యార్థులు తమ పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరే రవీందర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అంగన్వాడి సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఎల్ఓసి అందించిన

## అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



**ఎర్రవల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండలం రాజశ్రీ గార్లపాడు గ్రామానికి చెందిన మాదిగ బాబు ఆపరేషన్ నిమిత్తం 5,00,000/- రూపాయల ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే విజయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాధిత కుటుంబానికి ఈ సహాయం అందజేయడం పట్ల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 7 నుంచి ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు

• అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• ప్రిన్సిపాల్.ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి

**కల్వకుర్తి, ఆగస్టు 4(జనంసాక్షి):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను ఆగస్టు 7 నుంచి ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్,ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒకే విద్యా విధానంలో భాగంగా బీఏ,బీకాం,బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా (10+2), ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.అలాగే ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు కూడా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఉద్యోగం చేస్తున్న వారు, చదువును మధ్యలో నిలిపివేసిన వారు, ఉన్నత విద్యను కొనసాగించాలని భావిస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీపాద శర్వాణి సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 73829 29720, 98660 58900 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

## టీజీఆర్ఎస్ బాలికల పాఠశాలలో సేవా కార్యక్రమాలు

• విద్యార్థినులకు క్రీడా కిట్లు పంపిణీ !?
• విద్యార్థినులకు క్రీడా సామగ్రి, నూతన బోరు అందజేత
• సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బాలానగర్ టీజీఆర్ఎస్‌లో కార్యక్రమం!






**బాలానగర్, ఆగస్టు 04(జనంసాక్షి):** మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని టీజీఆర్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం మంగళవారం పలు సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. రంగారెడ్డిగూడ సర్పంచ్ కాటేపాగ ఆనంద్, బాలానగర్ సర్పంచ్ గుమ్మల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నూతన బోరును తవ్వించారు. విద్యార్థినులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఈ చర్య చేపట్టినట్లు వారు తెలిపారు. అదే కార్యక్రమంలో భాగంగా సంగీత శిక్షణ పొందుతున్న విద్యార్థినులకు తబలాలు, కరాటే శిక్షణ పొందుతున్న బాలికలకు కరాటే కిట్లను అందజేశారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థినులు రాణించేందుకు ఇలాంటి ప్రోత్సాహం అందించడం అభినంద నీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కుమ్మరుల మహిళా మండల కమిటీ

## ఏర్పాటు సమావేశాన్ని విజయవంతం చేయండి

### మండల అధ్యక్షులు శ్రీనివాసులు



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు 4 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో ఈ నెల 6న గురువారం కుమ్మరి మండల మహిళా కమిటీ ఏర్పాటు సమా వేశాన్ని స్థానిక మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**

గురువారం జరిగే ఈ మహిళా కమిటీ ఏర్పాటు సమావేశానికి కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్, రాష్ట్ర సలహాదారులు కుమ్మరి రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శంకరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరన్న, వనపర్తి జిల్లా అధ్యక్షులు సుగురు రాములు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. జిల్లా పరిధిలోని 15 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, యువకులు మరియు కుల సంఘ పెద్దలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఘనపురం మండల మహిళా కమిటీ ఏర్పాటును విజయవంతం చేయాలని శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**అచ్చంపేట. ఆగస్టు 4 (జనంసాక్షి):** నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్చారణల మధ్య సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా మరింత పురోగతి సాధించాలని స్వామివారిని జిల్లా కలెక్టర్ ప్రార్థించారు.

అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత, ఆలయ పురాతన వైభవం, భక్తుల విశ్వాసం, నిత్య పూజా కార్యక్రమాలు, వార్షిక ఉత్సవాల ప్రాముఖ్యత గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ దేవాలయం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమని, స్వామివారి దర్శనంతో భక్తులు తమ కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారని తెలిపారు. వేద పండితులు వేదాశీర్వచనాలతో జిల్లా కలెక్టర్‌ను ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ పాల్గొని ఆలయ విశిష్టతను అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, స్థానిక ఎస్సై, వివిధ శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను

# సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

• జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్ట్ 04(జనంసాక్షి):** ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత కోచింగ్ అవకాశాలను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ కాలనీలో ఉన్న ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజన, బోధన, మరియు శిక్షణ నిర్వహణను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలె క్టర్ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్టడీ సర్కిల్‌లో డిజిటల్ బోర్డు, స్టడీ చేర్స్, కంప్యూటర్స్ అవసరమని విద్యార్థులు కోరారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి కొద్దిసేపు తరగతి గదిలో కూర్చొని బోధన విధానాన్ని ప్రత్య క్షంగా పరిశీలించారు. ఎస్.ఎస్.సి, ఆర్.ఆర్.బి, బ్యాంకింగ్, గ్రూప్స్, తదితర ఉద్యోగ పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ వ్యవధి , విద్యార్థుల హాజరు తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 93 మంది విద్యార్థులకు 5 నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. తనిఖీలో భాగంగా స్టడీ సర్కిల్‌కు సంబంధించిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యసాధన దిశగా కృషి



చేయాలని, క్రమశిక్షణతో చదివితే తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

• సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు 4 (జనంసాక్షి):** మండల పరిధిలోని సోలిపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం స్థానిక సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి మరియు మండల విద్యాధికారి జయశంకర్ సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యార్థుల చదువు తీరు, మధ్యాహ్న భోజన నాణ్యత తదితర పలు అంశాలపై ఉపా ధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు చదువు పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని సూచిం చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దామరగిద్ద మండల సమస్యలను పరిష్కరించాలి: కలెక్టర్‌కు టిఆర్ఎస్ వినతి



**నారాయణపేట ఆగస్టు 4(జనంసాక్షి):** దామరగిద్ద మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గావి నోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రియాంకకు విన్నవించారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం దామరగిద్ద మండల కేంద్రంలోని మండ ల కార్యాలయాలను తనిఖీ చేసిన సందర్భంగా తెలంగా ణ రక్షణ సేన పార్టీ నారా యణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ కలెక్టర్‌ను కలిసి మండలంలో నెలకొ న్న పలు ప్రధాన ప్రజా సమ స్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడు తూ, ప్రస్తుతం నారాయణ పేట జిల్లా కేంద్రంలోని సింగారం సమీపంలో కొన సాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాలను దామరగిద్ద మండల కేంద్రానికి తరలిం చాలని కోరారు. అలాగే కాందేన్పల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఎస్సీ గురుకుల హాస్టల్‌తో పాటు పాఠశాల భవనాన్ని నిర్మిం చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దామరగిద్ద మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ భవనాలు శిథి లావస్థకు చేరుకుని, పరిపాలన నిర్వహణకు అనువుగా లేకపోవడంతో నూతన భవనాలను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దామరగిద్ద తండా లోని ప్రభుత్వ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థ కు చేరుకుని, పైకప్పు పెచ్చు లు ఊడిపడుతున్నాయని, విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారిందని తండా సర్పంచ్ శరణ్య నాయక్ కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంబడే తండాను స్వయం గా సందర్శించి పరిస్థితు లను పరిశీలించి, నూతన పాఠశాల భవనం మంజూ రుకు అవసరమైన ప్రతిపా దనలు ప్రభుత్వానికి పంపి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణసేన జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, పార్టీ నాయకులు ఉలిగుండం మహేష్, మాజీ ఎంపీటీ సీ శేఖర్, లోకుర్తి మాజీ సర్పంచ్ సుదర్శన్, పెద్దెంపల్లి మాజీ సర్పంచ్ వీరేష్, తండా పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షల సీసీ రోడ్డును

## ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి







**నాగల్‌గిద్ద, ఆగస్టు 04 (జనంసాక్షి):** నాగల్‌గిద్ద మండల పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదు పాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రారంభోత్సవం అనంతరం మండలంలోని పలు వురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆర్థిక ఇబ్బందు ల్లో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో ఊరటనిస్తా యని ఆయన అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర హామీల అమలు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానిం చారు. ఎమ్మెల్యేకు కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వంకేశ్వరం గ్రామంలో మినీ స్టేడియం నిర్మాణానికి వేగం





**అచ్చంపేట, ఆగస్టు 4 (జనంసాక్షి):** ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయా లను మరింత బలోపేతం చేసి, యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేలా మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను సూచించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం వంకేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మినీ స్టేడియం కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిని మంగళ వారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పదరా మండలంలోని వంకేశ్వరం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్-254లో ఉన్న 3 ఎకరాల 4 గుంటల స్థలాన్ని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల విస్తీర్ణం, భూ స్వరూపం, రాకపోకల సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు, మినీ స్టేడియం నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామీణ యువకుడు తన ప్రతిభను ప్రదర్శించుకునేందుకు నాణ్యమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు తయారవుతారని, వంకేశ్వరం గ్రామంలో ప్రతిపాదిత మినీ స్టేడియం నిర్మాణం పూర్తయిన తర్వాత పదర మండలంతో పాటు పరిసర గ్రామాల యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు.

క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ, సాధన, పోటీల నిర్వహణకు అవసరమైన వేదికగా ఈ మినీ స్టేడియం నిలుస్తుందని చెప్పారు. గ్రామీణ యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, స్టేడియం నిర్మాణానికి సంబంధించిన భూ రికార్డులు, సర్వే ప్రక్రియ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రతిపాదనలు తదితర అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని, ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిపాదిత స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, అవసరమైన నివేదికలను తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, వంకేశ్వరం గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రమ్య, సర్వేయర్ విజయనిర్మల, ఎస్ఐతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితునికి ఎల్ఓసి అందజేత



నిజాంపేట, ఆగస్టు 4 (జనంసాక్షి): నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన దొంతరమైన దుర్గయ్య కు ఆరోగ్యరీత్యా మెరుగైన వైద్యం కోసం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్ఓసి బాండును కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్వోసి కి సహకరించిన ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మా గౌడ్, దేశెట్టి సిద్ధ రాములు, దేశెట్టి లింగం, ఎల్లం, సులేమాన్, రహీం, సురేష్, దేవరాజ్, షానా మాదు, రమేష్, రవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముర్రుపాలే ఆరోగ్యానికి మేలు

- తల్లిపాలు వార్షికోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ గంగాధర్



కొండపాక, ఆగస్టు, 4(జనంసాక్షి): కొండపాక మండలం బందారం గ్రామంలో పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడంతో తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొలుపుల గంగాధర్ తల్లులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బందారం గ్రామంలో 1,2,3, అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా 6 నెలలు నిండిన చిన్న పిల్లలకు అన్నప్రాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణీలు, బాలింతలు తల్లులు, క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రు పాలు పట్టాలని అప్పుడే తల్లి బిడ్డలు క్షేమంగా ఉండడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. 3 సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రంలోని చేర్పించడంతో వారికి విద్యతో పాటు ఆటలు, మంచి పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజమణి, అంగన్వాడి టీచర్ రజిత ,అండాలు, ముత్యాలు, ఐసిడిఎస్ సిబ్బంది నాగరాజు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి


- మున్సిపల్ చైర్ పర్సన్ తీగల సునేంద్ర కుమార్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 4 (జనంసాక్షి): మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలో పెండింగ్లో ఉన్న పలు సమస్యలను గుర్తించి పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం 17వ వార్డులో విస్తృతంగా పర్యటించి మిషన్ భగీరథ, తాగునీటి పైప్‌లైన్ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం మరియు ఇతర మౌలిక వసతులపై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులు తమ సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యం, ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలే ధ్యేయమని, ప్రజా సేవలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, ఏఈ శివశంకర్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, కాలనీవాసులు ఉన్నారు.

# బొమ్మనపల్లి అభివృద్ధి పనులకు నాలుగేళ్లుగా పెండింగ్ బిల్లులు..

- రూ.25.86 లక్షల కోసం మాజీ సర్పంచ్ నిరీక్షణ

అచ్చంపేట, ఆగస్టు 4(జనంసాక్షి): మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామపంచాయతీలో గత పాలకవర్గం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నాలుగేళ్లుగా పెండింగ్ లో ఉండటంతో మాజీ సర్పంచ్ బోడ్యా నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్వంతంగా అప్పులు చేసి చేపట్టిన పనులకు ఇప్పటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మాజీ సర్పంచ్ బోడ్యా నాయక్ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం.. 2022 నుంచి 2024 మధ్య కాలంలో గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడం, వీధి దీపాల ఏర్పాటు, గ్రామంలోని అత్యవసర మౌలిక వసతుల కల్పనతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మొత్తం రూ.25,86,787 ఖర్చు చేశారు. ఈ పనులన్నీ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పూర్తయ్యాయని, పనులు పూర్తయిన అనంతరం పంచాయతీరాజ్ శాఖ అధికారులు మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) నమోదు ప్రక్రియను కూడా పూర్తి చేశారని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లు విడుదల కాలేదని ఆరు నెలల క్రితం గ్రామపంచాయతీల్లో కొత్త సర్పంచులు బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఆ నిధుల నుంచి గత పాలకవర్గం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బకాయి







బిల్లులను కూడా కొంత మేర చెల్లించాలని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదని, ప్రస్తుత పాలకవర్గం చేపట్టిన పనులకే ప్రాధాన్యం ఇస్తూ గత బకాయిలను విస్మరిస్తున్నారని విమర్శించారు. తాను చేసిన పనుల కోసం అవసరమైన నిధులను వ్యక్తిగతంగా అప్పుగా సమకూర్చుకున్నానని, బిల్లులు చెల్లింపులు ఆలస్యం కావడంతో అప్పులపై వడ్డీలు రోజురోజుకూ పెరుగుతున్నాయని బోడ్యా నాయక్ వాపోయారు. బిల్లులు రాకపోవడంతో అప్పులు తీర్చలేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని తెలిపారు. పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు పరిశీలించి ఎంబీలు నమోదు చేసిన తర్వాత కూడా బిల్లులు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సరైన స్పందన లభించలేదని, బిల్లుల చెల్లింపుపై స్పష్టత ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రామాభివృద్ధి కోసం వ్యక్తిగతంగా ముందుకొచ్చి పనులు చేపట్టిన ప్రజాప్రతినిధులకు ఇలాంటి పరిస్థితి ఏర్పడితే భవిష్యత్తులో ఎవరూ అభివృద్ధి పనులు చేయడానికి ముందుకు రారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి బొమ్మనపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసి తనకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ బోడ్యా నాయక్ విజ్ఞప్తి చేశారు.

## జడ్చర్లలో విజయవంతమైన బడిబాట

- ప్రభుత్వ బడుల్లో పెరిగిన ప్రవేశాలు
- జడ్చర్ల ఎంఈఓ మంజులా దేవి
- పాఠ్యపుస్తకాలు పూర్తి.. త్వరలో యూనిఫామ్స్



జడ్చర్ల, ఆగస్టు 4(జనంసాక్షి): తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు నిర్వహించిన బడిబాట కార్యక్రమం జడ్చర్ల మండలంలో విజయవంతమైనట్లు జడ్చర్ల ఎంఈఓ మంజులా దేవి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతి వివరాలను ఆమె మంగళవారం వెల్లడించారు. మండలంలో ఈ విద్యా సంవత్సరంలో బడిబాట ద్వారా ప్రీ – ప్రైమరీ మరియు 1వ తరగతిలో కొత్తగా మొత్తం 782 అడ్మిషన్లు నమోదయ్యాయని ఎంఈఓ మంజులా దేవి పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు ఆమె తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ప్రభుత్వ బడులలో చేరిన విద్యార్థుల సంఖ్య 214 వరకు ఉందని వెల్లడించారు. అలాగే బడిబాట సర్వేలో బడి బయటి పిల్లలు లేదా డ్రాపౌట్స్ 37 మందిని గుర్తించగా, వారిలో 32 మందిని బడిలో చేర్పించడం జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఐదేళ్లు నిండిన పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించే ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని వివరించారు. బడిబాటలో చేరిన పిల్లలతో పాటు అందరికీ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పూర్తిగా అందాయని, అయితే యూనిఫామ్స్ ఇంకా రావాల్సి ఉందని ఎంఈఓ స్పష్టం చేశారు. బడిబాట ముగిసిన తర్వాత విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూల్‌కు వచ్చేలా పాఠశాలల్లో వివిధ మోటివేషనల్ యాక్టివిటీస్ నిర్వహిస్తూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## రైతులకు నానో ఎరువులు, పీఎస్‌బీ పంపిణీ.. అవగాహన



నారాయణపేట ఆగస్టు 4(జనంసాక్షి): నారాయణపేట మండలం సింగారంలో మంగళవారం రైతులకు ఎరువుల పంపిణీ అవగాహన క్షేత్ర స్థాయిలో వినియోగంపై ప్రదర్శన నిర్వహించారు. సింగారం గ్రామ రైతులకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ, ఫాస్ఫరస్ సొల్యూబిలైజింగ్ బయోఫెర్టిలైజర్‌లను పంపిణీ చేశారు. నారాయణపేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ రైతులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా పోషకాల వినియోగ సామర్థ్యాన్ని మెరుగు పరచవచ్చని తెలిపారు. అలాగే, నేలలో మొక్కలకు అందుబాటులో లేని భాస్వరాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో పిఎస్‌బి బయోఫెర్టిలైజర్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, రైతులు దీన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రైతులు శాస్త్రీయ ఎరువుల వినియోగ పద్ధతులను పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవాలని డా. సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణపేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ, ఏ ఈ ఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

## లింగారెడ్డిపల్లిలో భారీగా టీఆర్ఎస్‌లో చేరిక

- ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యం
- జిల్లా అధ్యక్షులు గవి నోళ్ల శ్రీనివాస్





నారాయణపేట్, ఆగస్టు 4(జనంసాక్షి): నారాయణపేట్ జిల్లా దామర్‌గిద్ద మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో వార్డ్ మెంబర్ కుమ్మరి నారాయణ ఆధ్వర్యంలో సుమారు 100 మంది ప్రజలు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు, నారాయణపేట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గవి నోళ్ల శ్రీనివాస్ నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవి నోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. నారాయణపేట్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు లింగారెడ్డిపల్లి గ్రామ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, వాటి పరిష్కారం కోసం పార్టీ తరపున ఉద్యమిస్తామని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసి, కవితను ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, నాయకులు ఉలిగుండం మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ మొగలప్ప జిల్లా అధ్యక్షులు గవి నోళ్ల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొగలప్పను జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు ఘనంగా సన్మానించారు.

# బస్సు లేక విద్యార్థుల చదువు ఆగొద్దు

- ఎమ్మెల్యే మేఘారెడ్డికి శ్రీరంగాపూర్ లెక్చరర్ల వినతి
- 3 గ్రామాల నుండి 19 మందికి ఇంటర్ అడ్మిషన్లు చేయించాం
- శ్రీరంగాపూర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- RTC బస్సులు నడపండి సార్
- విద్యార్థుల తరపున ఎమ్మెల్యేకు వినతిపత్రం

**శ్రీరంగాపూర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి తాము గ్రామాలకు వెళ్లి ఇంటింటా ప్రచారం చేస్తున్నామని, కానీ రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మేఘారెడ్డి శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన సందర్భంగా లెక్చరర్లు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విద్యా సంవత్సరం వెంకటాపూర్, జానంపేట, నాగసాని పల్లి గ్రామాల నుండి జూన్ నెలలో 19 మంది విద్యార్థుల ఇండ్లకు తిరిగి, తల్లిదండ్రులను ఒప్పించి ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో అడ్మిషన్లు చేయించాం. కానీ కొల్లాపూర్–పెబ్బేరు ఆర్టీసీ బస్సులు శ్రీరంగాపూర్ మీదుగా లేకపోవడంతో పిల్లలు కాలేజీకి రావడానికి ఇబ్బంది పడుతున్నారు అని లెక్చరర్లు తెలిపారు. కొల్లాపూర్ మరియు వనపర్తి డిపో మేనేజర్లకు 4 సార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదని, ప్రత్యేకంగా మే 20, 2026 నుండి బుసిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని కోరారు.



ఈ మేరకు ఎమ్మెల్యే మేఘారెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసి అధికారులతో మాట్లాడి బస్సుల సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు శ్రీదేవి, జె.కురుమూర్తి, ఆశాజ్యోతి, కృష్ణమూర్తి, వెంకటకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటన్న పాల్గొన్నారు.

# విభజించు.. పాలించు కుట్రల వల్ల పదేళ్లు పథకాలకు దూరమైన విలేకరులు

- టియుడబ్ల్యూజే (ఐజేయు) రాజాపూర్ మండల అధ్యక్షుడిగా శివప్రసాద్, ప్రధానకార్యదర్శిగా భీమయ్య, ఉపాధ్యక్షుడిగా హరీష్

**రాజాపూర్, ఆగస్టు 4(జనంసాక్షి):** రాజాపూర్ మండలంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాపూర్ మండల నూతన కమిటీని ప్రకటించగా.. అధ్యక్షుడిగా శివప్రసాద్, (జనంసాక్షి రిపోర్టర్) కార్యదర్శిగా భీమయ్య, ఉపాధ్యక్షుడిగా హరీష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాటం నాగరాజు గౌడ్, సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడే ఏకైక సంఘం టియుడబ్ల్యూజే (ఐజేయు) అని, క్షేత్రస్థాయిలో పనిచేసే విలేకరులకు ఎలాంటి ఆపద వచ్చినా యూనియన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ప్రభుత్వ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు ఇప్పించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

గతంలో కొన్ని యూనియన్లు స్వార్థ ఎజెండాతో "విభజించు.. పాలించు" వైఖరిని అవలంబించడం వల్లే జర్నలిస్టుల మధ్య ఐక్యత కొరవడిందని జిల్లా నాయకులు విమర్శించారు. ఆ కుట్రల కారణంగానే గత పదేళ్ల పాటు విలేకరులు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనేక సంక్షేమ ఫలాలను తీవ్రంగా నష్టపోయారని ఆవేదన



వ్యక్తం చేశారు. జర్నలిస్టుల నిజమైన సంక్షేమం కోసం నిలబడే టియుడబ్ల్యూజే (ఐజేయు) లో భాగస్వాములు కావడం పట్ల స్థానిక విలేకరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి నరేందర్ గౌడ్, రాజాపూర్ మండల కోశాధికారి బొల్ల రాఘవేందర్, కార్యదర్శి సతీష్ రాథోడ్, కార్యవర్గ సభ్యులు ఎండి ముస్తఫా, సతీష్, కృష్ణయ్య, మైబు, రాజేష్,పాటు పలువురు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఊరు మెచ్చిన ఉపాధ్యాయుడు దేవరాజ్

- పుస్తక విద్యతో పాటు ఆచరణాత్మక బోధనకు పెద్దపీట
- పంట పొలాల్లో ఆర్గానిక్ వ్యవసాయంపై ప్రత్యేక తరగతులు
- దాతల సహకారంతో మెరుగైన వసతులు
- రాష్ట్రస్థాయికి ఉపాధ్యాయుడు దేవరాజ్ సైన్స్ ప్రాజెక్ట్
- అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఇతరులకు స్ఫూర్తిగా ఉపాధ్యాయుడి కృషి..
- రఘునందన్ రావు ఎంపీ,ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, విద్యాశాఖ అధికారులు
- మాజీ మంత్రి హరీష్ రావు , చేతుల మీదుగా అవార్డు

**సిద్దిపేట,ఆగస్టు 4(జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన చేగూరి దేవరాజ్ 2018లో ఈ పాఠశాలకు వచ్చారు. 2018 కి ముందు ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య 74 వచ్చిన తర్వాత మాత్రమే కానీ ఆయన గ్రామంలో తనకు అంతకుముందే ఉన్న సాన్నిహిత్యంతో మిత్రులు, ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయుల చొరవతో ఈ సంఖ్యను 140 మందికి పెంచారు. గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధుల పిల్లలు కూడా ఈ పాఠశాలలో చదవడం గమనార్హం. కేవలం తరగతి గది నాలుగు గోడలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధిని అందించేలా ఓ ఉపాధ్యాయుడు చేస్తున్న కృషి నేడు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది. పాఠశాల విద్యను సరికొత్త ఒరవడిలో నడిపిస్తూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారు నాంచారుపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు దేవరాజ్.



**"క్షేత్రస్థాయి ప్రదర్శనలతో అభ్యాసన"**

సాధారణంగా పాఠశాలల్లో కేవలం సిలబస్ పూర్తి చేయడంపైనే దృష్టి పెడతారు. కానీ, ఉపాధ్యాయుడు దేవరాజ్ మాత్రం చదువుతో పాటు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా చూపించడం ద్వారా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

**"పంట పొలాల్లో ఆర్గానిక్ వ్యవసాయ పాఠాలు"**

విద్యార్థులను నేరుగా పంట పొలాలకు తీసుకెళ్తున్నారు. అక్కడ వారికి ఆర్గానిక్ (సేంద్రీయ) వ్యవసాయం ప్రాముఖ్యత, రసాయనిక ఎరువుల దుష్ప్రభావాలు, ప్రకృతి సిద్ధమైన సాగు విధానాలపై తరగతులు నిర్వహిస్తూ వ్యవసాయంపై మమకారాన్ని పెంచుతున్నారు.

**"పెరిగిన విద్యార్థుల సంఖ్య"**

ఉపాధ్యాయుడి వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థులపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫలితంగా ఆ పాఠశాలపై నమ్మకం పెరిగి, విద్యార్థుల సంఖ్య 74 మంది నుంచి ఏకంగా 140కి పెరిగింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడిని ప్రగతి పథంలో నడిపిస్తున్న తీరుకు ఇది నిదర్శనం.

**"దాతల సహకారంతో మెరుగైన వసతులు"**

ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను తీర్చడానికి ఉపాధ్యాయుడు దేవరాజ్ స్థానిక దాతలను ముందుకు తీసుకువస్తున్నారు. దాతల సాయంతో పాఠశాలకు అవసరమైన అనేక ఆధునిక వసతులను సమకూరుస్తున్నారు. తరగతి గదుల మెరుగుదల, డిజిటల్ లెర్నింగ్ పరికరాలు, తాగునీరు, విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్ మరియు స్టేషనరీ వంటి సౌకర్యాలను సమకూర్చడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

**"రాష్ట్రస్థాయికి ఉపాధ్యాయుడు దేవరాజ్ సైన్స్ ప్రాజెక్ట్"**

సైన్స్ రంగంలో ఉపాధ్యాయులు, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేలా చేపట్టిన ప్రయత్నాల్లో మరో మైలురాయి నమోదైంది. ఈ సంవత్సరం సైన్స్ ప్రదర్శనలో భాగంగా ఉపాధ్యాయుడు దేవరాజ్ రూపొందించిన వినూత్న సైన్స్ ప్రాజెక్ట్ ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ విజయం స్థానికంగా విద్యావర్గాల్లోనూ, ఉపాధ్యాయ లోకంలోనూ ప్రశంసలు అందుకుంటూ గర్వకారణంగా నిలిచింది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కశిరెడ్డి

- నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే హామీ



**కల్వకుర్తి, ఆగస్టు 4(జనంసాక్షి):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణకు చెందిన సుమారు 20 మంది నిరుద్యోగ పోలీసు ఉద్యోగార్థులు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో వయోపరిమితి (ఏజ్ రిలాక్సేషన్) కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. వారి సమస్యను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడకపల్లి మనోజ్ అకాల మరణం బాధాకరం

- కుటుంబాన్ని పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



**నంగునూర్, ఆగస్టు4(జనంసాక్షి)** నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన తడకపల్లి మనోజ్ అతి చిన్న వయసులో మృతి చెందిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి , మనోజ్ అకాల మరణం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి విషాద సంఘటనలు కుటుంబానికి తీరని వేదనను మిగులుస్తాయని, ఆ బాధను మాటల్లో వర్ణించలేమని అన్నారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ తన వంతు అండగా ఉంటానని భరోసా కల్పిస్తూ, మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు.

## ఎస్ఐఆర్‌కు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనంసాక్షి);** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విజయవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 5,03,859 ఎన్యూమరేషన్ ఫారాల్లో 4,38,852, (87.10 శాతం) ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మరో 63,488 (12.60 శాతం) యూఈఎఫ్‌లు,1,519 (0.30 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గ్రైవ్వాజరు,వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలన్నారు. హరికృష్ణ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న
## జిరామ్ జి ఉద్యోగుల పెన్ డౌన్, షట్ డౌన్ సమ్మె



**మల్దకల్, ఆగస్టు 4 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని జి రాంజీ ఉద్యోగులు పెన్డౌన్ షట్ డౌన్ సమ్మె కొనసాగుతుంది. మంగళవారం జిరాంజీ ఉద్యోగులు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు రాజబాబు,అనూష, పరిమళ,సుజ్ఞానం మాట్లాడుతూఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని గత నాలుగు రోజుల నుంచి ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే పే స్కేల్ జీవో ఇచ్చినట్లయితే సమ్మె విరమింపు చేస్తామని వారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి 4 వేలకుటుంబాల జీవితాలు ముఖ్యమంత్రి నిర్ణయంపై ఆధారపడి ఉందని అన్నారు.రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపుమేరకు నాలుగో రోజు పెన్డౌన్ షట్ డౌన్ చేస్తున్నారని,నాలుగు నెలల నుండి జీతాలు లేక ఆఫీసు నిర్వహణ ఖర్చులు దాదాపు సంవత్సరం నుండి రావడంలేదని, కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ జీతం కూడా సంవత్సరం నుండి పెండింగ్లో ఉందని అన్నారు. పే స్కేల్ వస్తే అందరికీ న్యాయం జరుగుతుందని 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేదన్నారు.ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి 4000 కుటుంబాలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలనివారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు

- తల్లి పాలు బిడ్డకు సంపూర్ణ పోషణను ఇస్తాయి
- ఐ.సి.డి.ఎస్ సూపర్ సూపర్వైజర్ సాయి భవాని



**కోహెడ ఆగస్టు 04,(జనంసాక్షి):** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండలం లోని శనిగరం గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసు కొని, ప్రతి శిశువుకు జీవితంలోని తొలి క్షణాల నుంచే తల్లిపాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల తల్లులు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బిడ్డపుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలను అందించడం అత్యంత అవసరమని సూపర్వైజర్ సాయి భవాని పేర్కొ న్నారు. ప్రసవం అనంతరం వచ్చే ముర్రుపాలు శిశువుకు సహజసిద్ధమైన తొలి రోగనిరోధక రక్షణగా పనిచేస్తాయని, శిశువును అనేక అంటువ్యాధుల నుంచి కాపాడటంలో ముర్రు పాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు.ఆరు నెలల తర్వాత వయస్సుకు తగిన అనుబంధ ఆహారాన్ని ప్రారంభించినప్ప టికీ, రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడటంతో పాటు పోషకాహార లోపం, అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం తగ్గుతుందని ఆమె వివరించారు. ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య,ఉప సర్పంచ్ బుచ్చయ్య, అంగన్వాడీ టీచర్ లు,పంచాయతీ కార్యదర్శి, ఆయాలు ,గర్భిణీ స్త్రీ లు, బాలింతలు,సీ ఏలు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా
## ప్రజలు అప్రమంతంగా ఉండాలి ఎస్సై మహేష్



**సిర్పూర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** సిర్పూర్ మండల కేంద్రం లో ఎస్ఐ మహేష్ ముందస్తు హెచ్చరిక జారీ చేశారు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఉండాలని ఎస్సై మహేష్ సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, పొంగిపోర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితిలో మినహా అవసరం లేని ప్రయాణాలు నివారించాలి అని తెలిపారు.తల్లిదండ్రులు చిన్నారులు నీటి ప్రవాహాల దగ్గర వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. రైతులకు విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పోలీసుల కోసం సమాచారం అందించాలని ఎస్ఐ మహేష్ తెలిపారు.

## క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు

- పీ సెట్‌లో సత్తా చాటిన నందిని, దివ్య, ప్రవీణలకు ఘన సన్మానం



**మక్తల్, ఆగస్టు 4 (జనంసాక్షి):** గత మే నెలలో నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో మక్తల్‌లో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడా కారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి పట్టణానికి సముచిత గౌరవం తెచ్చారు. ఈ శిబిరంలో బి. గోపాలం పర్యవేక్షణలో మెరుగైన శిక్షణ పొందిన ఎన్. నందిని, జి. దివ్య, ఎం. ప్రవీణలు జూన్ నెలలో కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో అసమాన క్రీడా నైపుణ్యాన్ని చాటారు. ఈ ప్రవేశ పరీక్షలో ముగ్గురూ టాప్–20 లోపు ర్యాంకులు సాధించి హైదరాబాద్‌లోని ప్రసిద్ధ తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (దోమలగూడ) లో సీట్లు కైవసం చేసుకున్నారు. ఇందులో ఎన్. నందిని జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణి కాగా, జి. దివ్య, ఎం. ప్రవీణలు జాతీయ స్థాయి షూటింగ్ బాల్ గోల్డ్ మెడలిస్టులుగా గుర్తింపు పొందారు. ఈ విశేష విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం మక్తల్‌లో నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల లో పి.ఇ.టి శిక్షణకు ఎంపికకావడం ఎంతో గర్వకారణమని అన్నారు. క్రీడాకారులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని, శ్రమను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. దృఢమైన సంకల్పం, క్రమశిక్షణతో కూడిన శిక్షణతో ముందుకు సాగి, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి. క్రీడల్లో రాణించేందుకు మా తరపున పరిపూర్ణ సహ కారం ఎల్లప్పుడూ ఉంటుంది. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియే షన్ ఉపాధ్యక్షుడు జి. శివకుమార్‌తో పాటు క్రీడాకారుల తల్లిదండ్రు లు నాగమణి, ఆంజనేయులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, మందుల కొనుగోలుకు సరికొత్త యాప్

- ఈ నెల 6నుండి కొత్త యాప్ ద్వారానే విక్రయాలు
- మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ



న్యాల్ కల్, ఆగస్టు 04, (జనం సాక్షి) : వివిధ రకాల ఎరువులు, రసాయన మందులను రైతులు బుకింగ్ చేసి, కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ యాప్ లో.. ఈ నెల 6 నుండి సరికొత్త యాప్ అమల్లోకి రానుందని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రభుత్వ యంత్రాంగం తాజాగా ఓ సరికొత్త యాప్ ద్వారానే అర్హులైన రైతులకు అందించనుందని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ మంగళవారం ఓ ప్రకటనల విడుదల చేశారు.

**"ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్" ద్వారానే కొనుగోలు...**

రైతులకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్" ను ఈ నెల 6నుండి అమల్లోకి తీసుకురానుంది. ఈ యాప్ ద్వారానే రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకుని నిబంధనల మేరకు వివిధ రకాల ఎరువులు, రసాయనాల పురుగు మందులను కొనుగోలు చేసుకునేందుకు ఆస్కా రాన్ని కల్పించారు.

**కొనుగోలు చేసేందుకు రైతులకు ఇవి తప్పనిసరి..**

ఎరువులు, రసాయన మందులను కొనుగోలు చేసేందుకు రైతులు తప్పనిసరిగా.. ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ కచ్చితంగా లింకై ఉండాలి. లింకు చేసుకున్న ఫోన్ నెంబర్ కు ఓటీపీ రావడం జరుగుతుంది. బుక్ చేసుకున్న 48 గంటల్లోపు కచ్చితంగా సంబంధిత రైతులు కొనుగోలు కేంద్రానికి వెళ్లి కొనుగోలు చేసుకోవాలి.

బుకింగ్ చేసుకున్న 48 గంటల్లో కొనుగోలు చేసుకోకపోతే అట్టి రైతు ఐడి నెంబర్ ను బ్లాక్ చేయనున్నారు. అమల్లోకి రానున్న సరికొత్త యాప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఏదేని సమస్యలు ఉత్పన్నమైతే ఏవో, ఏఈఓల దృష్టికి తీసుకురావాలని మండల ఏవో రైతులకు సూచించారు.

## ఆగస్టు 6న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'


- మెదక్‌లో పోస్టర్ ఆవిష్కరణ
- మహాసభను విజయవంతం చేయాలని బట్టి అజయ్ పిలుపు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి):** మెదక్ నియోజకవర్గ తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) పార్టీ కార్యాలయం, ఇంద్రపురి కాలనీలో బుధవారం నిర్వహించనున్న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బట్టి అజయ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంతో సాధించుకున్న రాష్ట్రం ఇప్పుడు సామాజిక న్యాయంతో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళ, యువతకు సమాన అవకాశాలు, సముచిత ప్రాధాన్యం కల్పించే తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆగస్టు 6, 2026న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మెదక్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. "రండి... సామాజిక న్యాయ తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు అవుదాం" అంటూ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఇప్పా రమేష్, కసాపురం అశోక్, టౌన్ ఇన్‌చార్జ్ కేవల్ నందకుమార్, టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జునైద్, చినశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వీరస్వామి (టీఆర్ఎస్ పార్టీలో చేరిన అనంతరం), దగడ్ శ్రీకాంత్, ఎల్లం, అర్సలాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూరులో
## జీవవైవిధ్య యాజమాన్య కమిటీ ఏర్పాటు



**చేర్యాల, ఆగస్టు 04(జనంసాక్షి) :** జీవవైవిధ్య (సవరణ) చట్టం, 2023 మరియు తెలంగాణ జీవవైవిధ్య నియమ నిబంధనలు, 2015 ప్రకారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి చైర్మన్‌గా కొమ్ము రవి, కార్యదర్శిగా కొయ్యడ సందీప్ కుమార్, కమిటీ సభ్యులుగా అందె అశోక్, కదారి భాస్కర్, సాత్నాడి శ్రీనివాస్, తుంగ స్వప్న, కొమ్ము రేణుక, మొత్తం 7 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు మహిళా సభ్యులకు అవకాశం కల్పించారు. గ్రామంలోని సహజ వనరులు, జీవవైవిధ్యం పరిరక్షణ, స్థానిక జాతుల సంరక్షణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు ఈ కమిటీకి ఉంటాయని అధికారులు తెలిపారు. కమిటీ నియామకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేద్దాం

- కేంద్ర కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న అచ్చంపేటలో నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఉప్పు నుంతల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఏఎన్ ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో గ్రామాలు, బస్తీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని కోరారు. దేశంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖ తది తర పథకాలలో పనిచేస్తున్న కోటి మంది కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలైతే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన



మార్పులను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసి ప్రజా రంగాన్ని కాపాడాలని కోరారు. పేదల ఆహార భద్రత, కార్మికుల హక్కులు, రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమాల్లో పాల్గొని ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అనూష, రజిత, హేమలత, సాలమ్మ, గెలువమ్మ, బోజమ్మ, వెంకటమ్మ, సంగీత, కేస్‌లి, నర్మద, విజయతో పాటు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## చిన్నారుల భద్రత...సంక్షేమమే లక్ష్యం

- జిల్లా సంక్షేమ అధికారిని సునంద

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనంసాక్షి);** జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో నేడు జెడ్పిహెచ్ఎస్ కొండాపూర్, కేటీదొడ్డి మండలంలో ప్రత్యేక అవగాహ న కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ బి. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి సునంద ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు, నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, పోక్సో చట్టం-2012 , బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, బాల కార్మిక చట్టం, విద్యా హక్కు చట్టం-2009, జువెనైల్ జస్టిస్, చట్టం-2015, సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు ఎలాంటి వేధింపు లు, దుర్వినియోగం లేదా హింసకు గురైన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వా లని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని, అలాగే ఉచిత న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఒక్కరూ జాతీయ న్యాయ సేవా సంస్థ టోల్ ఫ్రీ



నంబర్ - 15100కు కాల్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.

ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు, విద్యను అభ్యసించే హక్కు, హింస మరియు దుర్వినియోగం నుండి రక్షణ పొందే హక్కును భారత రాజ్యాంగం మరియు వివిధ బాలల సంక్షేమ చట్టాలు కల్పించాయని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి. రఘు రామి రెడ్డి, సీడబ్ల్యూసీ కౌన్సిలర్ సురేష్, చైల్డ్‌లైన్ విభాగం ప్రతినిధి నవీన్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హనిమిరెడ్డి, భరోసా కేంద్రం ప్రతినిధి శ్వేత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనాల భక్తి వెల్లువలో మెదక్

- అరకటికె ఆధ్వర్యంలో వైభవంగా నల్లపోచమ్మ తల్లి బోనాలు
- వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

**మెదక్ టౌన్ ఆగస్టు 04, (జనంసాక్షి):** ఆషాఢ బోనాల ఉత్సవాలతో మెదక్ పట్టణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. అరకటికె సంఘం ఆధ్వర్యంలో శ్రీమాత నల్లపోచమ్మ తల్లికి అత్యంత వైభవంగా బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొని బోనం ఎత్తుకుని అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..**

నల్లపోచమ్మ తల్లి అనుగ్రహంతో మెదక్ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రం లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. అరకటికె సంఘం ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలు భక్తి, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సోదరభావం,



సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.బోనాల ఊరేగింపులో యువకులతో కలిసి డప్పుల చప్పుళ్లకు అనుగుణంగా నృత్యం చేస్తూ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన యువకులతో కలిసి ఉత్సాహంగా డాన్స్ చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, భక్తుల జైజైధ్వానాలు, అమ్మవారి నామస్మరణతో మెదక్ పట్టణం భక్తిమయ వాతావరణంలో కళకళలాడింది.

ఈ కార్యక్రమంలో అరకటికె సంఘం సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మామిళ్ళ.ఆంజనేయులు, జుబర్ అహ్మద్,దీపక్ కుమార్,మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్య రెడ్డి,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, నాయకులు చంద్ర మోహన్ గౌడ్, కిరణ్,జగదీష్, సతీష్ రావు,వేణు,రవి, ప్రభు గౌడ్, నవీన్, శ్రీనివాస్, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆగస్టు 6న గద్దర్ వర్ధంతి సభ

- పోస్టర్ ఆవిష్కరించిన గద్దర్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు
- అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

**మెదక్ బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి):** ప్రజాయుద్ధ నౌక గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వర్ధం తి సభను విజయవంతం చేయాలని గద్దర్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మెదక్‌లోని టీఎన్‌జీవో భవన్‌లో



వర్ధంతి సభ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ ఫౌండేషన్ సభ్యులు బొమ్మల మైసయ్య, జెల్ల సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు గంగాధర్, సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకుడు శంకర్ దయాల్ చారి, ఆకుల పెంటయ్య, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాయుద్ధ నౌక గద్దర్ తన జీవితాన్ని ప్రజల కోసం, పీడిత వర్గాల విముక్తి కోసం, సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని కొనియాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గద్దర్ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే రోజు మెదక్ జిల్లా కేంద్రంలోని స్టేడియం వద్ద కూడా వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, గద్దర్ అభి మానులు, కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా గౌండ్ల కులస్తుల బోనాల ఉత్సవాలు

- సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో వైభవంగా గౌండ్ల కులస్థుల బోనాలు
- పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి ఆగస్టు 04 (జనంసాక్షి):** సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో గౌండ్ల కులస్థుల బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సదాశివపేట పట్టణంలోని దుర్గమ్మ గుడిని సందర్శించిన నిర్మలా జగ్గారెడ్డి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గౌండ్ల కులస్థులు నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్ నాగరాజు గౌడ్



తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలో జరిగిన గౌండ్ల కులస్థుల బోనాల వేడుకలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, గొర్రె పొట్టేళ్లతో అలంకరించిన ఫలహారం బండి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ జోగిని నిషా క్రాంతి బోనం ఎత్తుకుని ఈ ఉత్సవంలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో గౌండ్ల సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ చక్రవర్తి గౌడ్ , సురేందర్ గౌడ్, నక్క నాగరాజు గౌడ్, ఆర్. సుధాకర్ గౌడ్, దుర్గా గౌడ్, భరత్ గౌడ్, ఫణి, కిరణ్, శ్రీకాంత్ , మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "నేషనల్ హైవేపై సూచిక బోర్డుల్లో తప్పులు"

- పేర్లు తప్పుగా రాయడంతో ప్రయాణికులు అయోమయం
- వెంటనే సరిచేయాలని ప్రజల డిమాండ్







**చేర్యాల, ఆగస్టు 04(జనంసాక్షి):** జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో అక్షర దోషాలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్ పై ఏర్పాటు చేసిన బోర్డుల్లో ఊర్ల పేర్లు తప్పుగా రాయడంతో వాహనదారులు గందరగోళానికి గురవు తున్నారు. నర్సాయపల్లి బదులుగా నరసైపల్లి, తాడూరు బదులుగా తాండూరు, చుంచనకోట బదులుగా చుంచుంకోట అని తప్పుగా ముద్రించారు. స్థానికేతరులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రయాణికులు ఈ బోర్డులు చూసి దారి తప్పుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో బోర్డులను నమ్మి వెళ్లి తప్పుదారి పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇది జాతీయ రహదారి కావడంతో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి వేసిన బోర్డుల్లోనే ఇలాంటి తప్పులు ఉండటం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు.

వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బోర్డుల్లోని అక్షర దోషాలను సరిచేయాలని, సరైన పేర్లతో కొత్త బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.